ఆంధ్రజ్యోతి



జయశంకర్ భూపాలపల్లి
ములుగు

శుక్రవారం 8 మార్చి 2024

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

వివరాలు 8వ పేజీలో





హరహర మహాదేవ

మహాశివరాత్రి పర్వదినం కోసం ఉమ్మడిజిల్లాలోని ఆలయాలు, శైవక్షేత్రాలు ముస్తాబయ్యాయి. విద్యుత్‌దీపాల అలంకరణలు, చలువ పందిళ్లతో మహాశివరాత్రి శోభను సంతరించుకున్నాయి. గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత నుంచి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు. అలాగే దర్శనాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా సౌకర్యాలు కల్పించారు. ఇక హనుమకొండలోని వేయిస్తంభాలగుడి, కాజీపేట మడికొండలోని మెట్టుగుట్ట, వరంగల్‌లోని భద్రకాళి ఆలయం, కాశీబుగ్గలోని కాశీవిశ్వేశ్వరాలయం, వెంకటాపూర్ మండలం రామప్పలోని రామలింగేశ్వర క్షేత్రం, కురవి వీరభద్రుడి సన్నిధి, మహదేవపూర్ మండలంలోని త్రివేణి సంగమ తీరంలోని కాళేశ్వర ముక్తీశ్వర సన్నిధానం.. ఇలా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని ఆలయాలన్నీ శివనామస్మరణతో మారుమోగనున్నాయి.

వివరాలు 7వ పేజీలో...



- ఆలయాలకు శివరాత్రి శోభ
- ప్రత్యేకపూజలు, జాగారణకు సర్వంసిద్ధం
- ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రదర్శనలకు ఏర్పాట్లు
- నేడు మహాశివరాత్రి పర్వం

ముస్తాబైన హనుమకొండలోని వేయిస్తంభాల దేవాలయం



ఓరుగల్లు రాణీరుద్రమలు..

- సమ్మక్క, సారలమ్మలిచ్చిన స్థైర్యంతో ముందడుగు
- ప్రజాప్రతినిధులు, అధికారులుగా పాలనలో అతివల మార్కు
- పొదుపు సంఘాల్లోనూ, పరిశుభ్రతలోనూ మేటిగా గుర్తింపు
- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

7లో



పోరాటాల పురిటిగడ్డ ఓరుగల్లు గడ్డ.. రాణీరుద్రమ పోరాట పటిమ.. వనదేవతలు సమ్మక్కసారలమ్మ ఇచ్చిన స్థైర్యంతో.. చాకలి ఐలమ్మ చూపిన బాటలో ముందడుగు వేస్తున్నారు ఉమ్మడిజిల్లా అతివలు. ప్రజాగళమై.. ప్రజలకు బలమై.. రాజకీయాలు, ప్రభుత్వ పాలనతో పాటు పలు రంగాల్లోనూ తమకు తామే సాటిగా నిరూపించుకుంటూ ఓరుగల్లు'రాణి రుద్రమ'లుగా గుర్తింపు పొందుతున్నారు. భవిష్యత్ తరాలకు స్ఫూర్తినిస్తున్నారు. శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా పలు రంగాల్లో సత్తా చాటుతున్న ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మహిళల గురించి ప్రత్యేక కథనం.

- హనుమకొండ సిటీ

అణువణువూ పరిశీలన

'మేడిగడ్డ'ను సందర్శించిన ఎన్‌డీఎస్‌ఏ బృందం

బ్యారేజీపై ఏడు గంటలపాటు అధ్యయనం

ఏడోబ్లాక్‌లో కుంగిన పియర్స్, పిల్లర్లు పరిశీలన



కంట్రోల్ రూం పిట్ట గోడ పైనుంచి మేడిగడ్డ బ్యారేజీని పరిశీలిస్తున్న బృందం

భూపాలపల్లి/కాటారం/మహదేవపూర్, మార్చి 7: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ లక్ష్మీబ్యారేజీని నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) గురువారం సందర్శించింది. నీటిపారుదలశాఖ అధికారులు, బ్యారేజీ నిర్మాణ సంస్థ ఎల్‌ఎన్‌టీ సిబ్బంది మినహా ఎవరినీ అనుమతించలేదు. సుమారు ఏడుగంటలపాటు బ్యారేజీని అణువణువూ పరిశీలించిన బృందం అనేక కోణాల్లో వివరాలు సేకరించింది. కాళేశ్వరం ప్రాజెక్టులో గుండెలాంటి మేడిగడ్డ బ్యారేజీ దెబ్బతిన్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌డీఎస్‌ఏకు లేఖరాసింది. దీంతో నిపుణుల బృందం గురువారం మేడిగడ్డలో పర్యటించి.. పియర్స్ కుంగిపోవడం, బీటలువారడం తదితర అంశాలను నిశితంగా పరిశీలించింది. ఏడో బ్లాక్‌లోని ప్రతీ పియర్ వద్ద క్షుణ్ణంగా అధ్యయనం చేసింది. ఈ క్రమంలో ఆ బృందం మొత్తం 19అంశాలను పరిశీలించి కీలక సమాచారాన్ని సేకరించిందని తెలుస్తోంది. సీడబ్ల్యూసీ మాజీ చైర్మన్, ఎన్‌డీఎస్‌ఏ నిపుణుల కమిటీ అధ్యక్షుడు చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలో ఆరుగురు సభ్యుల కమిటీలో న్యూఢిల్లీకి చెందిన సెంట్రల్ సాయిల్ అండ్ మెటీరియల్ రీసెర్చ్ స్టేషన్ సైంటిస్ట్ యు.సి. విద్యార్థి, సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ) డైరెక్టర్ శివకుమార్ శర్మ, డ్యాం గేట్స్ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అండ్ రెజిలియన్స్ డైరెక్టర్ రాహుల్ కుమార్ సింగ్, టెక్నికల్ టీం డైరెక్టర్ అమితాబ్ మీనా, ఎన్‌డీఎస్‌ఏ డిప్యూటీ డైరెక్టర్ సన్నీ యాదవ్, సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ పూణేకు చెందిన శాస్త్రవేత్త ఆర్. పాటిల్ తదితరులున్నారు. ఉదయం 9గంటలకు ఎల్‌అండ్‌టీ క్యాంప్ కార్యాలయానికి చేరుకున్న కమిటీ అల్పాహారం అనంతరం 9.34గంటలకు మేడిగడ్డ బ్యారేజీపైకి చేరుకుంది. బ్రిడ్జిపై నుంచి కుంగిన పియర్స్‌ను పరిశీలించిన తర్వాత అప్‌స్ట్రీమ్ వైపు బ్యారేజీ కిందికి వెళ్లారు. బ్యారేజీ ఏడో బ్లాక్‌లో కుంగిపోయిన 19, 20, 21, 22 పియర్స్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. పియర్స్‌లో కింది నుంచి పైవరకు భారీగా చోటుచేసుకున్న పగుళ్లను పరిశీలించారు. పియర్స్ నిర్మాణం చేసిన ఉపరితలం, లోపలివైపు పొరల గురించి తెలుసుకున్నారు. నిర్మాణ సమయంలోని బ్యారేజీ లేఅవుట్, డిజైన్స్, ఫౌండేషన్, క్వాలిటీ కంట్రోల్ నివేదికలు, థర్డ్ పార్టీ మానిటరింగ్ నివేదికలు, బ్యారేజీ అప్ అండ్ డౌన్ స్ట్రీమ్స్‌లో ప్రీ అండ్ పోస్ట్ మాన్‌సూన్ తనిఖీల నివేదికలు, పియర్స్ కోసం డ్రిల్లింగ్ చేసిన బోర్‌హోల్ లాగ్ వివరాలు, ఎస్‌పీటీ, ప్లేట్ లోడ్ పరీక్షల ఫలితాల గురించి ఇరిగేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నట్లు సమాచారం. బ్యారేజీలో అప్‌స్ట్రీమ్ వైపు సుమారు నాలుగున్నర గంటలు తనిఖీలు నిర్వహించిన అనంతరం ఎల్‌అండ్‌టీ క్యాంప్ కార్యాలయంలో మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం మధ్యాహ్నం 3.05 గంటలకు బ్యారేజీ డౌన్‌స్ట్రీమ్ వైపు వెళ్లారు. అక్కడ కుంగిన, పగుళ్లు, పియర్స్, రాఫ్ట్, ఆప్రాన్, సీసీ బ్లాక్స్‌ను పరిశీలించారు. బ్యారేజీలో ఏడో బ్లాక్‌లో పియర్స్ కుంగిపోవడం, భారీగా పగుళ్లు ఏర్పడటంతో ఈ మేరకు నష్టం వాటిల్లిందో అధ్యయనం చేయడానికి పియర్స్ పక్కన, అడుగున మట్టి, కాంక్రీట్‌ను తవ్వి నమూనాలు సేకరించారు. ల్యాబ్‌లో పరీక్షలు చేయనున్నట్లు సమాచారం. నిపుణుల కమిటీ వెంట ఇరిగేషన్ ఈఈ తిరుపతిరావు, డీఈఈ సురేష్, ఎస్సై ప్రసాద్ తదితరులు ఉన్నారు. ఈ తనిఖీలు సాయంత్ర 6 గంటల వరకు కొనసాగింది. అనంతరం నిపుణుల బృందం రామగుండం బయల్దేరింది. శుక్రవారం సుందిళ్ల బ్యారేజీని పరిశీలించనున్నట్టు సమాచారం.

ఎల్‌అండ్‌టీ కనుసన్నల్లోనే...

ఢిల్లీ నుంచి వచ్చిన నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ నిపుణుల బృందం పర్యటన అత్యంత పగడ్బందీగా సాగింది. నిపుణుల బృందం పరీక్షలు నిర్వహించే ప్రాంతానికి నిర్మాణ సంస్థ లార్సన్ అండ్ టుబ్రో సిబ్బందిని మినహాయిస్తే బయట వారిని ఎవరినీ అనుమతించలేదు. ముఖ్యంగా మీడియాను రాకుండా పోలీసులు బ్యారేజ్‌కు రెండు వైపులా నాకాబందీ చేశారు. వంతెనపైనుంచి రాకపోకలను పూర్తిగా అడ్డుకున్నారు. నిపుణుల బృందం పర్యటనకు సంబంధించి ఎలాంటి నిర్బంధాలు లేకపోయినా తనిఖీలు, పరీక్షల సందర్భంగా సమాచారాన్ని బయటకు పొక్కనీయకుండా ఎల్‌అండ్‌టీ సంస్థ పోలీసుల సహాయంతో గోప్యత పాటించిందనే విమర్శలు వ్యక్తమయ్యాయి.

మహారాష్ట్ర వాసులకు ఇబ్బందులు

ఎన్‌డీఎస్‌ఏ నిపుణుల కమిటీ మేడిగడ్డ బ్యారేజీ సందర్శనకు వచ్చిన నేపథ్యంలో బ్యారేజీ పైకి ద్విచక్రవాహనాలను అనుమతించకపోవడంతో పలువురు ఇబ్బందులు పడ్డారు. బ్యారేజీ ప్రధాన గేట్‌ను మూసిన సెక్యూరిటీ అధికారులు మీడియాను సైతం అనుమతించలేదు. తెలంగాణ వైపు నుంచి మహారాష్ట్రలోని పలు ప్రాంతాలకు వెళ్లడానికి బైక్‌లపై వచ్చిన కూలీలు, ప్రజలు ఇబ్బందులు పడ్డారు. గతంలో బైక్‌లను అనుమతించిన అధికారులు తనిఖీల కోసం ఎన్‌డీఎస్‌ఏ నిపుణుల కమిటీ రావడంతో బైక్‌లను అనుమతించకపోవడంతో ఇక్కట్లు పడ్డారు. ముల్లెలు, మూటలను పట్టుకుని సుమారు రెండు కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్లడం కనిపించింది.



మహిళలతోనే మానవాళి మనుగడ

ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి



ఫుడ్‌స్టాల్‌లో వంట రుచి చూస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ శ్రీజ

ములుగు కలెక్టరేట్, మార్చి 7: మహిళలతో మానవాళి మనుగడ సాధ్యమని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్ సమావేశపుహాల్‌లో గురువారం జరిగిన వేడుకలకు ఆమె హాజరయ్యా రు. అదనపు కలెక్టర్ పి.శ్రీజతో కలిసి కేక్ కట్ చేశారు. స్త్రీ లేకపోతే సృష్టిలో జీవంలేదన్నారు. మహిళలు ఆకాశమే హద్దుగా అన్నిరంగాల్లో ముందుకు సాగి పోవాలని ఆకాంక్షించారు మహిళా దినోత్సవం అనేది ఒకరోజు వేడుక మాత్రమే కాదని, ప్రతిరోజు మహిళలదేనని అన్నారు. మహిళలు పరస్పర సహాయ సహ కారాలు అందిపుచ్చుకుంటూ ప్రగతి పథంలో పయనించాలన్నారు. ఒకరికొకరు అండగా నిలవాలన్నారు. నిరాశనిస్పృహలకు లోనుకాకుండా ధృఢ సంకల్పం, ఆత్మస్థైర్యంతో లక్ష్యాలను సాధించాలన్నారు. అనంతరం వివిధ క్రీడల్లో గెలు పొందిన మహిళా ఉద్యోగులకు బహుమతులు అందజేశారు. అంతకుముందు ఆమె కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఫుడ్‌స్టాల్‌ను సందర్శించి వంటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి స్వర్ణలత లెనిన్, మైనారిటీ సంక్షేమశాఖ జిల్లా అధికారి ప్రేమలత, వివిధశాఖల అధికారులు, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉత్కంఠకు తెర

- మునిసిపల్ వైస్ చైర్మన్‌గా హరీశ్‌రెడ్డి
- నాటకీయ పరిణామాల మధ్య ఎన్నిక
- మళ్లీ బీఆర్ఎస్‌కే పట్టం
- హాజరుకాని కాంగ్రెస్ కౌన్సిలర్లు



హరీశ్‌రెడ్డిని ఎత్తుకుని ఆనందోత్సాహం వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ కౌన్సిలర్లు

భూపాలపల్లి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మూడు నెలల ఉత్కంఠకు తెరపడింది. మునిసిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక ఎట్టకేలకు గురువారం ప్రశాంతంగా ముగిసింది. సభ్యులు మళ్లీ బీఆర్ఎస్‌కే పట్టం కట్టారు. వైస్ చైర్మన్‌గా ఆ పార్టీకి చెందిన కౌన్సిలర్ గండ్ర హరీశ్‌రెడ్డిని ఎన్నుకున్నారు. బీఆర్ఎస్‌కు చెందిన కౌన్సిలర్లు 16 మంది హాజరు కాగా కాంగ్రెస్ కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. వారి కోసం సుమారు గంటపాటు వేచి చూసిన అధికారులు.. అనంతరం ఎన్నిక ప్రక్రియను ప్రారంభించారు.

భూపాలపల్లి మునిసిపాలిటీలో 30 వార్డులు ఉన్నాయి. బీఆర్ఎస్‌కు చెందిన కౌన్సిలర్లు 17 మంది ఉండగా నెల రోజులుగా వీరు ప్రత్యేక క్యాంపులో ఉన్నారు. కాంగ్రెస్ కౌన్సిలర్లు 12 మంది ఉండగా వీరు కూడా మరో క్యాంపును ఏర్పాటు చేసుకున్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు వ్యూహప్రతి వ్యూహాలకు పదును పెట్టారు. కౌన్సిల్‌లో ఉన్న ఏకైన బీజేపీ కౌన్సిలర్ మద్దతును కూడా కూడగట్టుకోవడానికి కాంగ్రెస్ ప్రయత్నించింది. మరోవైపు బీఆర్ఎస్ నుంచి ముగ్గురు కౌన్సిలర్లను తమ వైపు తిప్పుకోవడానికి కాంగ్రెస్ పావులు కదిపిందని తెలుస్తోంది. సొంత పార్టీ కౌన్సిలర్లు 12 మంది, బీజేపీకి చెందిన ఒకరు మొత్తం 13 మందితోపాటు ఎక్స్ అఫిషియో సభ్యుడైన ఎమ్మెల్యే సత్యనారాయణరావుతో కలిపి 14 మంది ఉండగా మరో ముగ్గురు బీఆర్ఎస్ కౌన్సిలర్ల మద్దతుతో వైస్ చైర్మన్ పదవిని కైవసం చేసుకోవాలని కాంగ్రెస్ వ్యూహం రచించింది. అయితే.. బీఆర్ఎస్ కౌన్సిలర్లలో 16 మంది గురువారం నేరుగా వైస్ చైర్మన్ ఎన్నికకు హాజరయ్యారు. కాంగ్రెస్ కౌన్సిలర్లు అనూహ్యంగా గైర్హాజరయ్యారు. దీంతో వైస్ చైర్మన్‌గా బీఆర్ఎస్ కౌన్సిలర్ హరీశ్‌రెడ్డి ఎన్నిక ఏకగ్రీవమైంది. .

వ్యూహాలకు పదును పెట్టినా..

నాలుగు నెలల క్రితం భూపాలపల్లి మునిసిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌పై అదే పార్టీకి చెందిన కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం చేస్తూ కలెక్టర్‌కు, అదనపు కలెక్టర్‌కు లేఖను అందించారు. సొంత పార్టీ నుంచి వచ్చిన తీవ్ర ఒత్తిడి నేపథ్యంలో వైస్ చైర్మన్

మిగతా 8వ పేజీలో...



తునికాకు ప్రూనింగ్ చేపట్టాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటరెడ్డి

ములుగు కలెక్టరేట్, మార్చి 7: జిల్లాలోని ఏజెన్సీలో తునికాకు ప్రూనింగ్ పనులు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకటరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు గురువారం జిల్లా కేంద్రంలోని డీఎఫ్‌వో కార్యాలయంలో అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ వేసవిలో ఏజెన్సీ గిరిజనులకు తునికాకు సేకరణ పంట లాంటిదని అన్నారు. వెంటనే సంబంధిత అధికారులు ప్రూనింగ్ పనులు చేపట్టాలని, 50ఆకుల కట్టకు రూ.5 చెల్లించాలని కోరారు. తునికాకు బోనస్ డబ్బులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనట్లయితే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో నాయకులు బీరెడ్డి సాంబశివ, రత్నం రాజేందర్, గ్యానం వాసు, కొప్పుల రఘుపతి, కొర్ర రాజు, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్‌ను అందించాలి

ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి



రేగొండ మండలం చెన్నాపూర్‌లో సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

భూపాలపల్లి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను నిరంతం అందించాలని ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. జిల్లాలోని పలు మండలాల్లో ఆయన గురువారం సుడిగాలి పర్యటన చేశారు. రేగొండ మండలంలోని చెన్నాపూర్‌లో 11కేవీ ఫీడర్ మరమ్మతు పనులను పరిశీలించారు. దీన్ని పూర్తి చేసి నిరంతర విద్యుత్ సరఫరాను కొనసాగించాలని అధికారులకు ఆదేశించారు. చిట్యాల, టేకుమట్ల మండలాల్లో మోరంచవాగు వల్ల దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను, ట్రాన్స్‌ఫార్మర్ల పునరుద్ధరణను పరిశీలించారు. అనంతరం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని విద్యుత్ కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ సర్వీసులను వెంటనే రిలీజ్ చేయాలని ఆదేశించారు. గృహజ్యోతిలో జీరో బిల్లు రాని వినియోగదారులు ఎంపీడీవో, మునిసిపల్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే గణపురం మండలం చెల్పూరులోని కేటీపీపీని సందర్శించి అనంతరం అధికారులతో సమీక్షించారు. విద్యుత్ అంతరాయాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. విద్యుత్ ప్రగతిపై మాట్లాడారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని, నిరంతరం విద్యుత్ ఉండేలా చర్యలు చేపట్టాలని అన్నారు. ఆయన వెంట జిల్లా సూపరింటెండెంట్ మల్సూర్ నాయక్, డీఈ నాగరాజు, ఏడీఈలు, ఏఈలు తదితరులు ఉన్నారు.







రుద్రేశ్వరాలయంలో శివరాత్రి ఉత్సవాలు ప్రారంభం



బ్రహ్మోత్సవాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో డాక్టర్ బండా ప్రకాశ్

హనుమకొండ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండలోని చారిత్రక రుద్రేశ్వరస్వామి వారి వేయిస్తంభాలగుడిలో గురువారం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. తెలంగాణ రాష్ట్ర శాసన మండలి వైస్‌చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, నగర పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝూ జ్యోతి ప్రజ్వలన చేసి బ్రహ్మోత్సవాలను లాం ఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా బండా ప్రకాశ్ మాట్లాడుతూ.. 19 సంవత్సరాల తర్వాత కల్యాణ మండపం పనులు పూర్తయి ఒక అపూర్వఘట్టం ప్రారం భమవుతోందన్నారు. దేశ, విదేశాల నుంచి వచ్చే సందర్శకులకు ఇది ఒక అపూర్వ కానుక అన్నారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 8600 శివాలయాల్లో మహాశివరాత్రి ఉత్సవాల నిర్వహణకు ప్రభుత్వ పరంగా ఏర్పాట్లు చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు. సీపీ అంబర్ కిశోర్ ఝూ మాట్లాడుతూ.. శివరాత్రిని పురస్కరించుకుని లక్షలాదిగా తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగ కుండా భద్రతా పరంగా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. అనంతరం వీరికి వేదపండితులు ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు, శేషవస్త్రాలను అందించారు. ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ, వేదపండితులు ఫణిభూషణ శర్మ, గంగు మణికంఠ వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్పొరేటర్ శ్రీమాన్, రుద్రేశ్వర సేవా సమితి సభ్యుడు పులిరజనీకాంత్, తోట పవన్, గంధ్రాతి రాజు, కోన శ్రీకర్ పాల్గొన్నారు.

అంతకు ముందు ఉదయం ఉత్తిష్ఠ గణపతి ఆరాధన, రుద్రేశ్వరస్వామికి రుద్రాభిషేకం నిర్వహించారు. యాగమండపంలో ఉత్సవ రుద్రేశ్వర స్వామివారిని ప్రత్యేక వేదికపై అలంకరించి, అంకురారోహణ, నవగ్రహ ఆరాధన, కలశస్థాపన, రుత్వికరణ, యాగశాల ప్రవేశం, గణపతి నవగ్రహ రుద్రహోమ సహిత 18 సప్తశతి అధ్యాయాలతో లోకకళ్యాణార్థం మహాచండీయాగం నిర్వహించారు.

కల్యాణ మండపంలో పునఃశ్చరణ పూజలు:

పునరుద్ధరించిన కల్యాణ మండపంలో సప్త పుణ్యావాచనం, వాస్తు పూజ, యంత్ర, తంత్ర పూజ, అష్టదిక్పాలక పూజ, వేదోక్తంగా 21 మంది వేద పండితుల ఆధ్వర్యంలో ఆగమ శాస్త్ర ప్రకారంగా కల్యాణ మండప పునఃశ్చరణ పూజలు నిర్వహించారు. మహాహారతి అనంతరం భక్తులకు నందీశ్వరుని దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఇంటాక్ కన్వీనర్ ప్రొఫెసర్ పాండురంగారావు, మండపం పునర్నిర్మాణంలో పాలుపంచుకున్న స్థపతి శివకుమార్, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ రామల సునీత, కేంద్ర పురావస్తు శాఖ అధికారి మల్లేశం పాల్గొన్నారు.

భూముల క్రమబద్ధీకరణ ఉచితంగా చేయాలి

మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్

హనుమకొండ కలెక్టరేట్, మార్చి 7 : భూముల క్రమబద్ధీకరణ ఉచితంగా చేయాలని మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. ఈ మేరకు బీఆర్ఎస్ నాయకులు గురువారం హనుమకొండ కలెక్టరేట్‌లో అడిషనల్ కలెక్టర్ వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో భూముల క్రమబద్ధీకరణ దరఖాస్తులను ఆహ్వానించడం జరిగిందని, రాష్ట్ర వ్యాప్తంగా 25 లక్షలకుపైగా దరఖాస్తులు వచ్చాయన్నారు. వీరందరికీ న్యాయం జరగాలంటే ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ క్రమబద్ధీకరణ ఉచితంగా చేయాలన్నారు. లేదంటే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, 'కుడా' మాజీ చైర్మన్లు సంగంరెడ్డి సుందర్ రాజ్ యాదవ్, మర్రి యాదవరెడ్డితో పాటు పశ్చిమ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

హరహర మహాదేవ

ఆలయాలకు శివరాత్రి శోభ

ప్రత్యేక పూజలు, జాగరణకు సర్వంసిద్ధం

హనుమకొండ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలో శుక్రవారం మహాశివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధమైంది. ప్రత్యేకపూజలు, అభిషేకాలు, జాగరణకోసం ఆలయాలు, శైవక్షేత్రాలు ముస్తాబవగా భక్తుల కోసం విస్తృత ఏర్పాట్లు చేశారు. వరంగల్ లో పంచభూత లింగాలు ప్రతిష్ఠితమై ఉండడం విశేషం కాగా వరంగల్ కోటలో స్వయంభూ శంభులింగేశ్వరాలయంలో పృథ్వీలింగంగా, వరంగల్ మట్టెవాడలోని భోగేశ్వరాలయంలో జలలింగంగా, భద్రకాళి దేవాలయంలోని భద్రేశ్వర స్వామి ఆలయంలో తేజోలింగంగా, హనుమకొండలోని సిద్దేశ్వరాలయంలో వాయులింగంగా, మడికొండలోని మెట్టుగుట్టపైగల శ్రీ మెట్టురామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆకాశలింగంగా శంకరుడి పంచభూతాత్మక పంచముఖలింగ క్షేత్రాలు ప్రసిద్ధిగాంచాయి. శివాలయాలకు వేలాదిగా తరలివ చ్చే భక్తుల సౌకర్యార్థం యుద్ధ ప్రాతిపదికపై అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. వరంగల్, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో ని సుప్రసిద్ధ శైవక్షేత్రాలో కూడా శివరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నా రు. శివకల్యాణంతో పాటు లింగోద్భవ కాలంలో విశేషమైన పూజలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తుల రద్దీ ని నియంత్రించడానికి ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ ప్రాంగణాల్లో తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నారు.



భక్తుల కోసం వేయిస్తంభాల ఆలయంలో ఏర్పాటు చేసిన క్యూ లైన్లు

వేయిస్తంభాలగుడిలో..

హనుమకొండలోని రుద్రేశ్వరస్వామివారి వేయిస్తంభాల గుడిలో ఉదయం 3.30 గంటలకు సుప్రభాతం, 4 గంటల నుంచి స్వామివారికి సామూహిక రుద్రాభిషేకాలు, నిత్యవిధి హవనం, సాయంత్రం 6.59 గంటలకు ధనిష్ఠ నక్షత్రయుక్త సింహలగ్న సుమూహూర్తాన శ్రీ రుద్రేశ్వర స్వామి, రుద్రేశ్వరీ దేవి కల్యాణోత్సవం, రాత్రి 12 గంటలకు లింగోద్భవ కాలంలో స్వామివారికి మహాన్యాసపూర్వక మహారుద్రాభిషేకాలు నిర్వహిస్తారు. జాగరణ చేసే భక్తుల కోసం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. దేవాదాయ శాఖ, రెవెన్యూ, పోలీసు, వరంగల్ మహానగర పాలక సంస్థల సంయుక్తాధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని ఆలయ ప్రాంగణం అంతా షామియానాలు, మూడు క్యూలైన్లను ఏర్పాటు చేశారు. వరంగల్ భద్రకాళీగుడిలోని భద్రేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 5వ తేదీ నుంచే మహాశివరాత్రి వేడుకలు ప్రారంభమయ్యాయి. శుక్రవారం మహాశివరాత్రి రోజున తేజోగింగం (అగ్నిముఖలింగం) దర్శనార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

పూలు, పండ్లకు భలే గిరాకీ..

మహాశివరాత్రి సందర్భంగా నగరంలో పలు చోట్ల పండ్లు, పూల అమ్మకాలు జోరుగా సాగాయి. కిలో పూలు రూ. 500 నుంచి రూ. 800 వరకు పలకగా.. పండ్లు కూడా కిలో చొప్పున ప్రత్యేక అమ్మకాలు ఏర్పాటు చేశారు. శివరాత్రి స్పెషల్ కందగడ్డ కూడా రూ. 20 నుంచి రూ.50వరకు అమ్మకాలు జరిగాయి.

నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు

వరంగల్ క్రైం, మార్చి 7: శివరాత్రి సందర్భంగా శుక్రవారం ట్రై సిటీ పరిధిలో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం అర్ధరాత్రి నుంచి శనివారం ఉదయం 10గంటలకు వరకు నగరప్రజలు నిబంధనలు పాటించాలని సూచించారు.

● ములుగు, పరకాల వైపు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు పెద్దమ్మగడ్డ, కేయూసీ క్రాస్, అంబేద్కర్ జంక్షన్ మీదుగా హనుమకొండ బస్టాండ్‌కు చేరుకోవాలి. హనుమకొండ బస్టాండ్ నుంచి ములుగు, కరీంనగర్ వైపు వెళ్లే బస్సులు ఏషియన్ శ్రీదేవి మాల్, అంబేద్కర్ జంక్షన్, కేయూసీ క్రాస్ మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. హనుమకొండ బస్టాండ్ నుంచి నర్సంపేట్, తొర్రూరు, భద్రాచలం వైపు వెళ్లే బస్సులు బాలసముద్రం, అదాలత్, హంటర్‌రోడ్డు మీదుగా వెళ్లాలి.

ఉమ్మడిజిల్లాలో పలు చోట్ల..

హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని నేరేళ్ల వేణుమాధవ్ కళాప్రాంగణంలో ఉజ్జయిని మహాకాళేశ్వర శివలింగ దర్శనం, 12 అడుగుల మహాశివలింగ దివ్యదర్శనానికి ఏర్పాట్లు చేశారు. శనివారం తెల్లవారు ఝాము వరకు కార్యక్రమాలను నిర్వహిస్తారు. వేలేరు మండలం మల్లికుదుర్ల గ్రామంలోని శ్రీగట్టుమల్లికార్జున స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు చేశారు. ములుగు జిల్లా పాలంపేటలోని రామప్ప దేవాలయం, ఆత్మకూరులోని పంచకూట ఆలయం, వరంగల్ ఉర్సు జాగీరులోని ఫణిగల రామప్ప గుడి, ఐనవోలులోని ప్రాచీన మల్లికార్జునస్వామి ఆలయం, వరంగల్ స్టేషన్ రోడ్డులోని కాశీవిశ్వేశ్వరాలయం, కరీమాబాద్‌లోని విశ్వేశ్వరాలయం, కాశిబుగ్గలోని విశ్వేశ్వరాలయం, జనగామ జిల్లా కుందారం గ్రామంలోని కుందేశ్వరాలయం, మహబూబాబాద్ జిల్లా కురవిలోని వీరభద్రస్వా మి ఆలయం, నీరుకుళ్లలోని చెన్నకేశవ ఆలయం, వరంగల్ మట్టెవాడలోని సుప్రసిద్ధ భోగేశ్వరాలయంతో సహా పలు శివాలయాల్లో వేడుకలు జరుగనున్నాయి.

వరంగల్ బస్టాండ్ నుంచి హనుమకొండకు వచ్చే బస్సులు చింతల్ బ్రిడ్జి, రంగసాయిపేట్, నాయుడు పెట్రోల్‌పంప్, ఉర్సుగుట్ట, అదాలత్ మీదుగా బస్టాండ్‌కు చేరుకోవాలి. ములుగు క్రాస్ నుంచి హనుమకొండ వెళ్లే మోటార్ సైకిళ్లు, కార్లు, ఆటోలు కాపువాడ మీదుగా హనుమకొండ బస్టాండ్ వైపు వెళ్లాలి. హనుమకొండ నుంచి వరంగల్ వెళ్లే వాహనాలు మర్కజీ రోడ్డు, కొత్తూర్ జెండా మీదుగా పెద్దమ్మగడ్డ రోడ్డు నుంచి వెళ్లాలి. వెయ్యి స్తంబాల గుడి వద్ద పార్కింగ్ సదుపాయం లేనందున వాహనాలు అమృత జంక్షన్ నుంచి వెయ్యి స్థంబాల గుడి వరకు, ఇక్కడి నుంచి అలంకార్ జంక్షన్ వరకు వాహనాలు అనుమతించరు.

ఓరుగల్లు రాణీ'రుద్రమ'లు..

- సమ్మక్క సారలమ్మలిచ్చిన స్థైర్యంతో ముందడుగు
- ప్రజాప్రతినిధులు, అధికారులుగా పాలనలో అతివల మార్కు
- పొదుపు సంఘాల్లోనూ, పరిశుభ్రతలోనూ మేటిగా గుర్తింపు

హనుమకొండ సిటీ, మార్చి 7 : పోరాటాల పురిటిగడ్డ ఓరుగల్లు గడ్డపై ఆ రాణీరుద్రమ వారసత్వానికి ప్రతీకలుగా ప్రజాపాలనలో సేవకులుగా.. వనదేవతలు సమ్మక్కసారలమ్మ ఇచ్చిన స్థైర్యమే ఆయుధంగా ముందడుగు వేస్తున్నారు ఉమ్మడిజిల్లా అతివలు. చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తితో ప్రజాగళమై.. ప్రజలకు బలమై.. ఇటు పాలనలో.. అటు రాజకీయాల్లో తమకు తామే సాటిగా నిరూపించుకుంటూ ఓరుగల్లు'రాణి'రుద్రమ'లుగా గుర్తింపు పొందుతున్నారు. భవిష్యత్ తరాలకు స్ఫూర్తినిస్తున్నారు. శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మహిళా ప్రజాప్రతినిధులు, అధికారులు, పొదుపుసంఘాలతో పాటు పలు రంగాల్లో సత్తా చాటుతున్న మహిళల గురించి ప్రత్యేక కథనం.



సమ్మక్క సారలమ్మల ప్రతిరూపాలుగా..

సమ్మక్క-సారలమ్మల ప్రతి రూపాలుగా ఉమ్మడిజిల్లాకు చెందిన పలువురు మహిళలు రాజకీయాల్లోనే కాకుండా వివిధ రంగాల్లో తమదైన పాత్ర పోషించారు. నాడు మాజీ ఎంపీ డాక్టరు కల్పనాదేవి పార్లమెంట్‌కు ప్రాతిని ధ్యం వహించి రాజకీయాల్లో మహిళల ప్రాధాన్యాన్ని చా టారు. ఆ తరువాత అనేక మంది మహిళలు రాజకీయా ల్లో రాణిస్తూ వచ్చారు. ప్రస్తుతం కొత్తగా ఏర్పడిన కాంగ్రె స్ ప్రభుత్వంలో ఉమ్మడి జిల్లా నుంచి ధనసరి సీతక్క, కొండా సురేఖ మంత్రులుగా ప్రాతినిథ్యం వహిస్తున్నారు. సీతక్క, కొండా సురేఖ ఇద్దరిదీ పోరాట చరిత్రే.



మేడారం జాతర సేవల్లో తొలి మహిళా ఆర్ఎం..

మేడారం జాతరకు రీజినల్ మేనేజర్‌గా ఓ మహిళా సేవలు అందించడం ప్రత్యేకంగా నిలిచింది. వరంగల్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్లుగా మహిళా అధికారులు వరుసగా ఇద్దరు వచ్చారు. శ్రీదేవి తొలి మహిళా ఆర్ఎంగా బాధ్యతలు చేపట్టిన గుర్తింపు పొంది వెళ్లగా...ఆమె స్థానంలో రీజినల్ మేనేజర్‌గా శ్రీలత రావడం గమనార్హం. మేడారం జాతరకు ఆర్టీసీ సేవలు ప్రధాన లక్ష్యం. ఓ మహిళా ఈ బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తుందా లేదా? అన్న సంశయాలకు శ్రీలత ఆమె తన విధులతో చెక్ పెట్టారు

క్లీన్‌సిటీ ఇమేజ్‌లోనూ మహిళా కార్మికుల పాత్ర

వరంగల్ మహానగరానికి గతంలో దేశంలోనే క్లీన్‌సిటీ ఇమేజ్ దక్కింది. దేశ వ్యాప్తంగా జరిగిన క్లీన్‌సిటీ పోటీల్లో వరంగల్ నగరం నెంబర్ వన్‌గా నిలిచింది. ఈ ఘనత సాధనలో వరంగల్ మహానగర పాలక సంస్థ మహిళా పారిశుధ్య కార్మికుల పాత్ర అనిర్వచనీయం. నగరాన్ని సుందరంగా, పరిశుభ్రంగా ఉంచడంలో మహిళా కార్మికులు అంకితభావంతో పని చేస్తున్నారు. పోరాటమే కాదు.. పొదుపు పాఠాలు నేర్పడంలోనూ తమకు సాటి లేరు అని నిరూపించారు ఓరుగల్లు మహిళామణులు. ధర్మసాగర్, వేలరు మండలాల నుంచి అనేక మంది కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్ (సీఆర్‌పీ)లు దేశంలోని ఉత్తరప్రదేశ్, బిహార్, మధ్యప్రదేశ్, ఢిల్లీ ఇతరా రాష్ట్రాల్లో పర్యటించి అక్కడి మహిళా స్వయం సహాయక సంఘాలకు పొదుపు పాఠాలు నేర్పుతున్నారు. దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్వయంగా సీఆర్‌పీ మహ్మద్ షాహిద్ కౌసర్ బేగంతో స్వయంగా ఫోన్‌లో మాట్లాడారు. మన్ కి బాత్‌లో ప్రస్తావించారు. సీఆర్‌పీల సేవలను ప్రశంసించారు. స్వయం సహాయక సంఘాల పొదుపు సేవల్లో వరంగల్ జిల్లా ప్రధాన మంత్రితో కీర్తించబడి దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందంటే ఓరుగల్లు మహిళామణుల ఘనకీర్తే.

నాలుగు జడ్పీలు, కార్పొరేషన్ పీఠాలపై వారే..



వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య | హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ | ములుగు జడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి | ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి | భూపాలపల్లి జడ్పీ చైర్‌పర్సన్ శ్రీహర్షిణి

ఉమ్మడి వరంగల్‌లోని ఆరు జిల్లాల్లో నాలుగు జిల్లా పరిషత్ పీఠాలను మహిళలే అధిరోహించారు. ఇది రాజకీయ రణరంగంలో ఓరుగల్లు మహిళా చాణక్యతకు నిదర్శనంగా నిలిచింది. మహబూబాబాద్ జడ్పీ చైర్‌పర్సన్‌గా అంగోతు బిందు, భూపాలపల్లి జడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి, వరంగల్ జడ్పీ చైర్ పర్సన్‌గా గండ్ర జ్యోతి, ములుగు జడ్పీ చైర్ పర్సన్‌గా బడే నాగజ్యోతి పాలనలో రాణిస్తున్నారు. ఎలాంటి అనుభవం లేకున్నా.. రాజకీయ వారసత్వం లేకపోయినా ఓరుగల్లు పోరాటపటిమను పుణికిపుచ్చుకుని.. పాలనలో దూసుకుపోతున్నారు. ఇక వరంగల్ మహానగర పాలక సంస్థ మేయర్ గుండు సుధారాణి, డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్ మసూద్ ఇద్దరూ మహిళలే. జీడబ్ల్యూఎంసీ చరిత్రలోనే మేయర్, డిప్యూటీ మేయర్‌గా ఇరువురు మహిళలు ప్రాతినిథ్యం వహించడం ఇదే ప్రథమం.

మూడు జిల్లాలకు పాలనాధికారులు..

వరంగల్, హనుమకొండ, ములుగు జిల్లాలకు మహిళా కలెక్టర్లే పాలనాధికారులుగా ఉన్నారు. హనుమకొండ కలెక్టర్‌గా సిక్తా పట్నాయక్, వరంగల్ కలెక్టర్‌గా ప్రావీణ్య, ము లుగు కలెక్టర్‌గా ఇలా త్రిపాఠి సేవలు అందిస్తున్నారు. ఐటీడీఏ పీవోగా చిత్ర మిశ్రా ఉన్నా రు. ఇక వరంగల్, హనుమకొండ అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు)గా అశ్విని తనాజీ వాఖడే, రాధిక గుప్తా వీరంతా జిల్లా పాలనలో తమదైన పాత్రను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. గడిచిన కొన్నేళ్లలో వరంగల్ మహానగర పాలక సంస్థకు మహిళా కమిషనర్లే సేవలు అందించారు. నీతూ ప్రసాద్, స్మిత సబర్వాల్, శృతి ఓఝా, పమేలా సత్పథి, ప్రావీ ణ్య వీరంతా కూడా జీడబ్ల్యూఎంసీ పాలనలో తమదైన మార్కు వేసి కలెక్టర్లుగా పదోన్నతిపై వెళ్లిన వారే. వరంగల్ కలెక్టర్లుగా పని చేసి వెళ్లిన వారిలో శాలినిమిశ్రా, వాకాటి కరుణ, దమయంతి, ఆమ్రపాలి దేశస్థాయిలో పేరు ప్రఖ్యాతలు సంపాదించారు.

24 మంది ఇన్‌స్పెక్టర్లు బదిలీ

వరంగల్ క్రైం, మార్చి 7: ఎన్నికల బదిలీల్లో భాగంగా భారీగా ఇన్‌స్పెక్టర్లు స్థాన చలనం చెందారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న 24 మంది ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ గురువారం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ ఉత్తర్వులు జారీ చేశారు.

పేరు	ప్రస్తుతం	బదిలీ స్థానం
పి.సత్యనారాయణరెడ్డి	కమిషనరేట్	సుబేదారి
ఎస్.వాసుదేవరెడ్డి	సుబేదారి	మల్టీజోన్-1
బి.సంజీవ్	కమలాపూర్	కేయూసీ
వి.చేరాలు	కేయూసీ	కమీషనరేట్
ఇ.హరికృష్ణ	కమీషనరేట్	కమలాపూర్
ఎం.శివకుమార్	వీఆర్	ఇంతేజార్‌గంజ్
ఎల్.పవన్‌కుమార్	ఇంతేజార్‌గంజ్	గీసుగొండ
జి.బాబులాల్	గీసుగొండ	వీఆర్
పులి రమేశ్	టాస్క్‌ఫోర్స్	ఏనుమాముల
పి.కిషన్	ఏనుమాముల	ఎస్‌బీ
వి.క్రాంతికుమార్	ఎస్‌బీ	ఆత్మకూరు
ఆర్.సంతోష్	ఆత్మకూరు	పీసీఆర్ వరంగల్
కె.సూర్యప్రసాద్	వీఆర్	మహిళ ఠాణా-1
కె.శ్రీధర్‌రావు	మహిళా ఠాణా-1	సీసీఆర్‌బీ
ఎస్.వెంకట్రాం	మల్టీజోన్	మహిళా ఠాణా-2
ఎ.సువర్ణ	మహిళా ఠాణా-2	వీఆర్
ఎంఏ.షకుర్	సీసీఆర్‌బీ	హనుమకొండ (ట్రాఫిక్)
జి.సీతారెడ్డి	హనుమకొండ ట్రాఫిక్	ఎస్‌బీ
పి.నాగబాబు	ఎస్‌బీ	కాజీపేట ట్రాఫిక్
కె.సుజాత	కాజీపేట ట్రాఫిక్	వీఆర్
సార్ల రాజు	మల్టీజోన్-1	టాస్క్‌ఫోర్స్
ఎస్.రవికుమార్	వీఆర్	టాస్క్‌ఫోర్స్
కె.దామోదర్	వీఆర్	మల్టీజోన్-1
జి.వేణు	టాస్క్‌ఫోర్స్	మల్టీజోన్-1

ఎలక్టోరల్ బాండ్ల వివరాలను వెల్లడించాలి

ఎస్‌బీఐ ఎదుట కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నా

కాళోజీ జంక్షన్, మార్చి 7: ఎలక్టోరల్ బాండ్ల వివరాలను వెల్లడించేందుకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సుప్రీంకోర్టును మరింత సమయం కోరడాన్ని నిరసిస్తూ హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి నాయకత్వంలో బ్యాంకు ఎదుట గురువారం ధర్నా, నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఎలక్టోరల్ బాండ్ పథకం ప్రాథమిక లబ్ధిదారుగా ఉన్న అధికార బీజేపీ ఆర్థిక అవకతవకలను నల్లధనం మూలాన్ని దాచిపెట్టేందుకు ఎస్‌బీఐని వాడుకుంటోందని ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికలు ముగిసే వరకు జాప్యం చేయాలనే ఉద్దేశ్యంతోనే ఎలక్టోరల్ బాండ్స్ డేటా కోసం గడువు పొడిగించాలని కోరడం పలు అనుమానాలకు దారితీస్తుందని అన్నారు. బీజేపీకి విరాళాలు అందజేసిన దాతల పేర్లు బయట పెట్టకుండా మోసం చేయడంలో ఎస్‌బీఐ బీజేపీతో కుమ్మక్కైందని అన్నారు. ఎస్‌బీఐ డిజిటల్ ఇండియా, కంప్యూటరైజ్డ్ అకౌంట్ ఏమైందని ఆయన ప్రశ్నించారు. ఎలక్టోరల్ బాండ్ పథకాన్ని రాజ్యాంగ విరుద్ధమని భావించి సుప్రీంకోర్టు వాటిని నిషేధించిందని, విరాళాలు అందజేసిన దాతల పేర్లను బహిర్గతం చేయాలని రాజకీయ పార్టీలను కోర్టు ఆదేశించిందని అన్నారు. ధర్నా కార్యక్రమంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కూచన రవళి, ఎర్రబెల్లి వరద రాజేశ్వర్‌రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మహ్మద్ అజీజ్ ఖాన్, కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మోసాలకు కేరాఫ్ కాంగ్రెస్

ఎమ్మెల్యే కడియం శ్రీహరి



వరంగల్ క్రైం, మార్చి 7 : కాంగ్రెస్ మోసాలకు పెట్టింది పేరని, అమలు సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇందిరమ్మ ఇళ్ల పేరిట మరోమోసం చేసేందుకు సిద్ధమైందని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ధ్వజమెత్తారు. గురువారం హనుమకొండలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్‌లో లోక్‌సభ అభ్యర్థుల ఎంపిక నిర్ణయం అధిష్ఠానానిదేనని, స్థానిక నేతల అభిప్రాయాలు తీసుకుని విజయావకాశాలున్న వారికి టికెట్ ఇస్తారని ఆయన స్పష్టం చేశారు. 'వరంగల్ ఎంపీ అభ్యర్థిగా మీ కూతురు బరిలో ఉంటుందా?' అని విలేకరులు అడిగిన ప్రశ్నకు స్పందించిన కడియం విజయం సాధించే వారికి అవకాశాలు లభిస్తాయంటూ ఆయన సమాధానాన్ని దాటవేశారు. అమలుకు సాధ్యం కానీ హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వందరోజుల్లో ప్రజల నుంచి వ్యతిరేకతను ఎదుర్కొంటుందన్నారు. ఎన్నికల కోసం ఆదరాబాదరాగా లాంచింగ్ ప్రక్రియకు శ్రీకారం చుట్టినట్టు ఆయన విమర్శించారు. 15వ తేదీలోపు లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందని తెలిసి ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమం ప్రారంభిస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల కోడ్‌తో ప్రారంభ ప్రక్రియ ఆగుతుందని ఆయన ధ్వజమెత్తారు. ఇప్పటికే ఇచ్చిన నాలుగు హామీలు నిబంధనల పేరిట ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో ఉద్యోగ నియామకాల ప్రక్రియ ప్రారంభమైందని, ఎన్నికల కోడ్‌తో నియామక పత్రాలు ఇవ్వలేకపోయినట్లు కడియం వివరించారు. బీఆర్ఎస్ హయాంలో ఇచ్చిన ఉద్యోగాలకు సంబంధించిన నియామక పత్రాలు ఇస్తూ కాంగ్రెస్ వారు ఇచ్చినట్లు గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు.

తరతరాలుగా మాదిగలకు అన్యాయం

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ



సభలో మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

కాళోజీ జంక్షన్, మార్చి 7 : తరతరాలుగా మాదిగలకు అన్యాయం జరుగుతుందని అందుకు కారణం కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలేనని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. గురువారం హనుమకొండ హరిత కాకతీయ హోటల్‌లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ అనుబంధ సంఘాల వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా మంద కృష్ణ మాదిగ హాజరయ్యారు. ఈ సదస్సుకు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్ అధ్యక్షత వహించారు. షెడ్యూల్డ్ కులాలకు రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్ ఫలితాలను మాదిగలకు దక్కకుండా మాలలు ఎగురేసుకుపోతున్నారని ఆయన అన్నారు. మాదిగలందరూ బీజేపీకి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. గత నవంబరు 11న విశ్వరూప సభకు ఒక కులానికి సంబంధించిన సమావేశానికి ప్రధాని హాజరు కావడం దేశ చరిత్రలో ఎక్కడా లేదన్నారు. మాదిగల 30 ఏళ్ల పోరాటానికి మూడు నెలల్లో ముగింపు తేవడానికి సహకరిస్తూ అండగా నిలబడుతూ అక్కున చేర్చుకుంటున్నారని తెలిపారు. ఏ పల్లెలో చూసినా మాదిగలు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల్లోనే ఉన్నారని బీజేపీకి ఉనికి లేదన్నది వాస్తవమని పార్టీలకు అతీతంగా మాదిగలంతా బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని మంద కృష్ణ మాదిగ అభ్యర్థించారు. సదస్సులో పాల్గొన్న వారంతా వారి ప్రాంతాలకు వెళ్లి ప్రజలకు మాదిగలకు జరిగిన అన్యాయాన్ని వివరించాలన్నారు. సదస్సులో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నేతలు మంద కుమార్ మాదిగ, జన్ను దినేష్ మాదిగ పాల్గొన్నారు.

15 నుంచి ఒంటిపూట బడులు

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 7 : ఎండల తీవ్రత దృష్ట్యా మార్చి 15 నుంచి ఒంటి పూట బడులు నిర్వహించాలని గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విద్యా సంవత్సరం చివరి రోజు వరకు ఏప్రిల్ 23 వరకు అన్ని యాజమాన్యాల పాఠశాలలు ఒంటి పూట బడులను నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పాఠశాలలు నిర్వహించాలని సూచించారు. మధ్యాహ్నం 12.30 గంటలకు మధ్యాహ్న భోజనం అందించిన తర్వాతనే విద్యార్థులను ఇళ్లకు పంపించాలని పేర్కొన్నారు. పదవ తరగతి ప్రత్యేక తరగతులు ఎలాంటి ఆటంకాలు లేకుండా కొనసాగించాలని, 10వ తరగతి పరీక్షలు ప్రారంభమైన తర్వాత కేంద్రాలున్న పాఠశాలలు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన కలెక్టర్



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి పూల మొక్కను అందజేస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 7: కేంద్ర మంత్రి, రాష్ట్ర బీజేపీ చీఫ్ కిషన్‌రెడ్డికి జిల్లా హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ పూల మొక్కను అందజేశారు. హనుమకొండ, వరంగల్, ములుగు జిల్లాల పర్యటనలో భాగంగా గురువారం నిట్ గెస్ట్ హౌజ్‌కు చేరుకున్న మంత్రి కిషన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్ ఆయనకు పూల మొక్క అందజేసి స్వాగతం పలికారు. అక్కడే పోలీసులు మంత్రికి గౌరవ వందనం సమర్పించారు.

వైభవంగా మహాశివరాత్రి జాతర


కాళేశ్వరాలయంలో స్వామి వారి ఊరేగింపు

మహదేవపూర్, మార్చి 7: మండలంలోని త్రివేణి సంగమ గోదావ రిలో వెలసిన కాళేశ్వర ముక్తీశ్వర సన్నిధానంలో మూడు రోజుల పాటు జరిగే మహాశివరాత్రి జాతర గురువారం ప్రారంభమైంది. తొలిరోజు ఉదయం 10 గంటలకు మంగళ వాయిద్యాలతో దీపారాధన, గణపతి పూజ, స్వస్తి పుణ్యాఃవాచనం, రక్ష బంధనం, దీక్షా వస్త్రధారణ, నవకలశారాధన, నవగ్రహ ఆరాధనం, మండప దేవతారాధన, వృషభధ్వజ పటాదివాసం నిర్వహించారు. సాయంత్రం 4 గంటలకు అగ్ని ప్రతిష్ఠ, రుద్రహవనం, రాత్రి 8 గంటలకు కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలతో గ్రామంలో నడివీధుల్లో ఊరేగింపు, ఎదురుకోలు సేవ, రాత్రి 9 గం.లకు ప్రసిద్ధ కళాకారులచే భక్తి సంగీత కార్యక్రమాలు, సాంస్కృతి కార్యక్రమాలు జరిగాయి. స్వామివారి ఉత్సవ విగ్రహాలకు రాత్రి ఎదుర్కోలు సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం నుంచి ఉత్సవ విగ్రహాలను మంగళ వాయిద్యాల నడుమ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవో మారుతి, ఎంపీటీసీ మమత, ఆలయ ధర్మకర్తలు రాంరెడ్డి, సమ్మయ్య, అర్చకులు, సిబ్బంది, వేద పండితులు పాల్గొన్నారు.

హుండీల వితరణ

శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయానికి గురువారం నారాయణ ఆగ్రో రైస్ మిల్లు తరపున రెండు స్టీలు హుండీలను బహూకరించారు. ఈ హుండీలను ధర్మకర్తలు రాంరెడ్డి, శ్యాంసుందర్, సమ్మయ్యల సమక్షంలో ఆలయ ఈవో మారుతికి అందజేశారు.

నేటి కార్యక్రమాలు ఇలా..

ముక్తీశ్వరాలయంలో శుక్రవారం సాయంత్రం 4.30గంటలకు ధనిష్టా నక్షత్రయుక్త కర్కాటక లగ్నాన శ్రీ ముక్తీశ్వర శుభానందలకు కల్యాణ మహోత్సవం, అక్షతారోహణం నిర్వహించనున్నారు. రాత్రి 8 గంటలకు హరికథా కాలక్షేపం, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు, రాత్రి 12 గంటలకు మహాభిషేకం, లింగోద్భవపూజ, కాళరాత్రి చండీ హవనం నిర్వహించనున్నారు. స్వామి వారి కల్యాణంలో రాష్ట్ర మంత్రి దద్దిళ్ల శ్రీధర్‌బాబు పాల్గొంటారని ఈవో మారుతి తెలిపారు.

రామప్ప ఆలయం ముస్తాబు

వెంకటాపూర్(రామప్ప), మార్చి 7: మహాశివరాత్రి వేడుకలకు మండలంలోని పాలంపేట గ్రామంలో రామప్ప రామలింగేశ్వర స్వామి దేవాలయం సిద్ధమైంది. దేవాదాయశాఖ అధికారులు భక్తుల సౌకర్యార్థం ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేయగా ఆలయ ప్రాంగణంలో విద్యుద్దీపాలను ఏర్పాటు చేశారు. కాకతీయ రాజులు ఏక, ద్వి, త్రికూట, పంచకూట ఆలయలను నిర్మించారు. హరహర మహాదేవ శంభో శంకర అంటూ భక్తజనం ఆ పరమశివుడి కరుణాకటాక్ష వీక్షణాల కోసం శైవక్షేత్రాల్లో బారులు తీరే శుభ సమయం వచ్చేసింది. మహాశివరాత్రి సందర్భంగా రామప్ప దేవాలయంలో భక్తుల తాకిడి ఎక్కువగా ఉన్నందున అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. శివుడికి అత్యంత ప్రీతిపాత్రమైన అభిషేకాలు చేస్తూ భక్తజనం మహాశివరాత్రి వేడుకలు జరుపుకునేందుకు సిద్ధం చేశారు.


విద్యుత్ వెలుగుల్లో రామప్ప దేవాలయం

నేటి నుంచి కార్యక్రమాలివే...

రామప్ప రామలింగేశ్వరస్వామి దేవాలయంలో ఈనెల 8వ నుంచి 10 వరకు మహాశివరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగనున్నాయి. 8న ఉదయం 4.30 గంటలకు సుప్రభాతం, 6గంటలకు గణపతిపూజ, అఖండ దీపారాధన, పుణ్యాహవచనం, అంకురార్పణ, రక్షబంధనం, రుత్విక్కరణం, సామూహిక రుద్రాభిషేకాలు, రాత్రి 10గంటలకు స్వామివారి కల్యాణ మహోత్సవం, జాగరణ జరుగనుంది. 9న ఉదయం 5గంటలకు సుప్రభాతం, గణతిపూజ, రుద్రాభిషేకం, 11గంటల నుంచి గణపతిపూజ, గ్రహారాధన, వీరభద్రపల్లేరము, సాయంత్రం భద్రకాళిపూజ, సహస్రనామార్చన, బలిహరణ, రాత్రి దీపోత్సవం, ఇదేరోజు తెల్లవారుజామున(ఆదివారం) ఉదయం 4గంటలకు అగ్నిగుండంలో నడుచుట జరుగనుంది. 10న ఉదయం 5గంటలకు సుప్రభాతం, గణతిపూజ, రుద్రాభిషేకం, 8గంటలకు నాగబలి, గెలుపు, ఆశీర్వచనం, ప్రసాద వినియోగం జరుగనుంది.

ధరణి పోర్టల్‌ను రద్దు చేయాలి

వెంకటాపురం(నూగూరు), మార్చి 7: ధరణి పోర్టల్‌ను రద్దు చేయాలని గోండ్వాన సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలకేంద్రంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వెంకటాపురం, వాజేడు మండలాల్లో ఆదివాసీల భూములను వలస గిరిజనేతరులు ఆక్రమించుకుంటున్నారని, గిరిజన చట్టాలను అమలుచేయాల్సిన అధికారులు పట్టించుకోవడంలేదని అన్నారు. ధరణి పోర్టల్ వల్ల గిరిజనులకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను రద్దు చేయాలని కోరారు. ఈసమావేశంలో నాయకులు పూనెం ప్రతాప్, రేగ గణేష్, చంటి, రాజబాబు, చింత మోహన్, కణితి వెంకటకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీఎస్‌కు 5జీ నెట్‌వర్క్ బహూకరణ

గోవిందరావుపేట, మార్చి 7: మండలంలోని చల్వాయి మండలపరిషత్ ప్రాథమిక పాఠశాలకు పరకాల మండలం రాయపర్తి గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ దంపతులు రాచర్ల శ్రీకాంత్-మాధవిలు రూ.20వేల విలువచేసే 5జీ నెట్‌వర్క్, వైఫై రూటర్, సెటప్‌బాక్స్‌ను గురువారం బహూకరించి చేయూతనందించారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో ఎంఈవో గొంది దివాకర్ మాట్లాడుతూ శ్రీకాంత్-మాధవిలు గతంలో ఈ పాఠశాలకు రూ.70వేల విలువచేసే అధునాతన ప్రొజెక్టర్, ఎల్ఈడీ స్క్రీన్, సౌండ్‌సిస్టమ్‌ను అందించారని, మళ్లీ ఇంటర్నెట్ సౌకర్యం కల్పించడం అభినందనీయమని అన్నారు. రిటైర్డు ఉపాధ్యాయుడు కల్యాణపు రమేష్ మాట్లాడుతూ విద్యార్థులు దాతలను ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్.వాసుదేవరెడ్డి, ఉపాధ్యాయులు శివనాగేశ్వర్‌రావు, ఎం.మాధవీలత, ఎల్.రమేష్, మల్లారెడ్డి, దిలీప్, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం కృతజ్ఞత సభను విజయవంతం చేయండి

గోవిందరావుపేట, మార్చి 7: హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన భవన్‌లో ఈనెల 12వతేదీన జరిగే సీఎం రేవంత్‌రెడ్డి కృతజ్ఞత సభను విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు మేడుదుల వెంకన్న పిలుపునిచ్చారు. గురువారం మండలకేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉద్యమకారుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం గుర్తించాలని, 250గజాల ఇంటిస్థలం అందించాలని, గుర్తింపుకార్డులు, పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈసమావేశంలో ఉద్యమకారులు పెండెం హేమాద్రి, సూరినేని శ్రీనివాసరావు, తిరుపతి, బత్తుల రాణి, కొండి రమేష్, ఆకినపల్లి రమేష్, సంజీవ, గట్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరుడిని దర్శించుకున్న అదనపు కలెక్టర్


రామలింగేశ్వర స్వామిని దర్శించుకుంటున్న శ్రీజ

వెంకటాపూర్(రామప్ప), మార్చి 7: రామప్ప దేవాలయాన్ని గురువారం ములుగు అదనపు కలెక్టర్ పి.శ్రీజ సందర్శించారు. ఈసందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు ఆమెను సాదరంగా ఆహ్వానించగా రామలింగేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా మహాశివ రాత్రిని పురస్కరించుకుని దేవాలయం ఆవరణలో చేపడుతున్న పనుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆమె సూచించారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

వాజేడు, మార్చి 7: గంజాయి తరలిస్తున్న ఇద్దరు వాజేడు పోలీసులు అరెస్టు చేశారు. వెంకటాపురం (నూగూరు) సీఐ బండారి కుమార్ తెలిపిన వివనాల ప్రకారం.. జగన్నాథపురం వై జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై వాజేడు ఎస్సై చవళ్ల వెంకటేశ్వరరావు సిబ్బందితో గురువారం వాహనాలను తనిఖీ నిర్వహించారు. ఈ క్రమంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం భూపాలపట్నం నుంచి వెంకటాపురం వైపు వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సును సోదా చేయగా ఓ యువకుడితోపాటు మైనరు అందులోంచి పారిపోయేందుకు యత్నించారు. దీంతో పోలీసులు వారిద్దరిని పట్టుకొని తనిఖీ చేయగా సుమారు 500 గ్రాముల గంజాయి లభించింది. దీంతో ఇరువురు స్టేషన్‌కు తీసుకొని వెళ్లి విచారించారు. వీరిద్దరిలో ఒకరు మంగపేట మండలం కమలాపురానికి చెందిన బోనగిరి సాయి అనే యువకుడు కాగా మరొకరు 17 ఏళ్ల మైనర్ అని తేలింది. వీరిద్దరు గంజాయికి అలవాటుపడ్డారని, కొద్ది రోజులుగా అది దొరకపోవడంతో బీజాపూర్‌కు వెళ్లి బస్సులో తీసుకొస్తున్నారని వెల్లడైంది. దీంతో వారిని అరెస్టు చేశారు. 500 గ్రాముల గంజాయితోపాటు ఒక స్మార్ట్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

భూపాలపల్లి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్త్రీ మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోభూపాలపల్లి కలెక్టరేట్‌లో గురువారం వేడుకలు జరిగాయి. మహిళా ఉద్యోగులకు ఈ సందర్భంగా ఆటల పోటీలు జరిగాయి. ముఖ్యఅతిథిగా సంక్షేమ శాఖ జిల్లా అధికారి నాగేశ్వరరావు హాజరయ్యారు. మహిళలు ఇష్టమైన రంగాన్ని ఎంచుకొని ప్రగతి పథంలో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది, ఐసీడీఎస్ ఉద్యోగులు, వివిధ శాఖల మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

- చిట్యాల : మండలంలోని గురుకుల పాఠశాలలో డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ అధ్వర్యంలో అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవం జరిగింది. ముఖ్య అతిథిగా సమాజిక కార్యకర్త మా భూమి సంధ్య హాజరయ్యారు. సమాజంలో మహిళలు అనాదిగా అణచివేత ధోరణికి గురవుతున్నారని, దీనిపై ఐక్య పోరాటాలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి, ఎంపీవో రఘుపతి, గురుకుల ప్రధానోపాధ్యాయుడు బిక్షపతి, డీటీఎఫ్ జిల్లా ఉపాధ్యాక్షురాలు దేవేంద్ర, రమణారెడ్డి, సుదర్శన్, అశోక్, సమ్మయ్య, ప్రభాకర్, వీరేశం తదితరులు పాల్గొన్నారు.
- ములుగు కలెక్టరేట్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాకోర్టు ఆవరణలో వేడుకలు జరిగాయి. జిల్లా జడ్జి పీవీపీ.లలిత శివజ్యోతి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మహిళలు చదువుకోవడం వల్ల కుటుంబాన్ని, పిల్లలను కాపాడుకోగలుగుతారని, ఆర్థికంగా బలోపేతం అవుతారని అన్నారు. అనంతరం మహిళా సిబ్బంది జడ్జిలను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి టి.మాధవి, జూనియర్ సివిల్ జడ్జి రామ్మోహన్‌రెడ్డి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జె.సౌఖ్య, ముఖ్య పరిపాలన అధికారి అనూప్‌కుమార్, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్యామ్‌ప్రసాద్, బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ మేకల మహేందర్, న్యాయవాదులు వేణుగోపాలచారి, వినయ్‌కుమార్, కె.రవీందర్, స్వామిదాస్, రాజ్‌కుమార్, రాజేందర్, సుస్మిత, నవత తదితరులు పాల్గొన్నారు.
- వెంకటాపూర్(రామప్ప): మండలకేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో ఎస్టీయూ మండల అధ్యక్షుడు లకావత్ శ్రీనివాస్‌నాయక్ అధ్యక్షతన గురువారం జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా విద్యాశాఖ అధికారి పాణిని హాజరయ్యారు. ఇన్‌చార్జి ఎంఈవో సామల శ్రీనివాసులు, డీసీఈబీ కార్యదర్శి ఎన్నెం విజయమ్మ, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు శిరుప సతీష్‌కుమార్, నాయకులు ఏళ్ల మధుసూదన్, గజ్వేల్ విష్ణుమూర్తి, బిల్ల స్రవంత్, డేగల రమేష్, లవనిక, చెవుల మహేష్, తదితరులు పాల్గొన్నారు.



ములుగులో జడ్జిలను శాలువాలతో సన్మానిస్తున్న మహిళా సిబ్బంది

దళితబంధు లబ్ధిదారుల నిరసన

ములుగు కలెక్టరేట్, మార్చి 7: రెండో విడత దళితబంధు పథకం నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ములుగులో దళితబంధు సాధన సమితి ఆధ్వర్యంలో లబ్ధిదారులు గురువారం బస్టాండ్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట కళ్లకుగంతలు కట్టుకుని వినూత్నంగా నిరసన తెలిపారు. దళితబంధు సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కోగిల మహేష్ మాట్లాడుతూ రెండో విడత దళితబంధులో కలెక్టర్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని 1,100 మంది లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేశారని గుర్తు చేశారు. వారం రోజుల్లో లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు జమ చేయకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. మండల అధ్యక్షుడు కప్పంపల్లి బాబు, నాయకులు మడికొండ రమేష్, దాసరి రమేష్, సంజీవ తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్ఎంల ఆందోళన

ములుగు కలెక్టరేట్, మార్చి 7: పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ రెండో ఏఎన్ఎంలు గురువారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ములుగులోని డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ మాట్లాడుతూ రెండో ఏఎన్ఎంలకు మూడునెలల పెండింగ్ వేతనాలు, టీఏ,డీఏ అందించాలని, ఆరునెలల పీఆర్సీ బకాయిలు విడుదల చేయాలని, రెండో ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని, మేడారం జాతరలో విధులు నిర్వర్తించిన వారికి అదనపు వేతనం అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డీఎంహెచ్‌వో కార్యాలయంలో అధికారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో రెండో ఏఎన్ఎంలు పాయం సరోజన, కోడి సుజాత, పావని, ఆదిలక్ష్మి, సునీత, లలిత, సంపూర్ణ, నాగమణి, కొమురం సుజాత, లక్ష్మి, సుగుణవతి, పుష్ప పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ


చెక్కును అందిస్తున్న ఎంపీపీ, తహసీల్దార్

కాటారం, మార్చి 7: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారు లకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను గురువారం పంపిణీ చేశారు. ఎంపీపీ పంతకాని సమ్మయ్య, తహసీల్దార్ నాగరాజు ప్రజా ప్రతినిధులతో కలిసి 55 కల్యాణలక్ష్మి, నాలుగు షాదీ ముబారక్ చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు రవీందర్‌రావు, జాడి మహేశ్వరి, బాసాని రవి, వివిధ పార్టీల నాయకులు కొట్టె శ్రీహరి, ప్రభాకర్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉత్కంఠకు తెర

(5వ పేజీ తరువాయి)

కొత్త హరిబాబు తన పదవికి డిసెంబరులో రాజీనామా చేశారు. ఈ క్రమంలో ఆ పదవి ఖాళీ అయ్యింది. ఈ నేపథ్యంలోనే వైస్ చైర్మన్ ఎన్నిక అనివార్యమైంది. వ్యూహప్రతివ్యూహాల నడుమ కాంగ్రెస్ కౌన్సిలర్‌కే వైస్ చైర్మన్ పదవి దక్కుతుందని భావించినప్పటికీ నాటకీయ రాజకీయ పరిణామాల నేపథ్యంలో బీఆర్ఎస్ కౌన్సిలర్‌కే వరించింది. ఒక రోజు ముందు ఓ కేసు విషయంలో కొత్త హరిబాబును పోలీసులు అరెస్టు చేయడానికి ప్రయత్నం చేయడం, అలాగే బీఆర్ఎస్‌కు చెందిన మరో కౌన్సిలర్ ఒకరు అనారోగ్యంతో ఉండడంతో వారి సంఖ్యాబలాన్ని తగ్గించి వైస్ ఎన్నికను సొంతం చేసుకోవచ్చని కాంగ్రెస్ ప్రయత్నం చేసిందని ఆరోపణలు ఉన్నాయి. అయితే.. కొత్త హరిబాబు నేరుగా ఎన్నికలో పాల్గొనడం, బీఆర్ఎస్ నుంచి వస్తారనుకున్న కౌన్సిలర్లు మద్దతు తెలపకపోవడంతో కాంగ్రెస్‌కు చుక్కెదురైంది. తమకు తగిన సంఖ్యాబలం లేకపోవడంతో ఇక ఎన్నికలో పాల్గొన్నా ప్రయోజనం లేదని భావించి కాంగ్రెస్ కౌన్సిలర్లు గైర్హాజరయ్యారని తెలుస్తోంది. దీంతో బీఆర్ఎస్‌కి మార్గం సుగమం అయ్యింది.

అజ్ఞాతం వీడి నేరుగా హాజరైన హరిబాబు

ఓ కేసులో బుధవారం ఉదయం మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ కొత్త హరిబాబును పోలీసులు అరెస్టు చేయడానికి ప్రయత్నించారు. ఆయన చాకచక్యంగా తప్పించుకొని అజ్ఞాతంలోకి వెళ్లారు. గురువారం ఉదయం 10గంటలకు మునిసిపల్ కార్యాలయంలో ప్రత్యక్షమయ్యారు. అప్పటికే ఈ కేసు విషయంలో ఉన్న వారు హైకోర్టు నుంచి యాంటీస్పెటర్ బెయిల్ తీసుకోవడంతో హరిబాబు సహా మరో ఇద్దరు కౌన్సిలర్లు మునిసిపల్ సమావేశానికి హాజరయ్యేందుకు అవకాశం లభించింది. వీరిలో గండ్ర హరీశ్‌రెడ్డి కూడా ఉన్నారు.

ఉరి వేసుకొని ఒకరి ఆత్మహత్య


మధుకర్ (ఫైల్)

టేకుమట్ల, మార్చి 7: ఉరి వేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆశిరెడ్డిపల్లికి చెందిన పేరవేన మధుకర్(50) భార్య సారక్క నాలుగేళ్ల క్రితం అనారోగ్యంతో మరణించింది. అప్పటి నుంచి మధుకర్ మనోవేదనకు గురయ్యాడు. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో సమీపంలోని చింతచెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమారుడు రాజ్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

హైదరాబాద్‌లో మేదరమెట్ల వాసి మృతి


అరవింద్ (ఫైల్)

మొగుళ్లపల్లి, మార్చి 7: మండలంలోని మేదరమెట్ల గ్రామానికి చెందిన యువకుడు హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. కొడాలి శ్రీనివాస్-కోమల దంపతులకు కుమార్తె, కుమారుడు అరవింద్ (20) ఉన్నారు. శ్రీనివాస్ కొన్నేళ్లక్రితం భార్య, కూతురు కూలినాలి పనిచేసుకుంటూ జీవిస్తున్నారు. అరవింద్ ఏడాదిక్రితం హైదరాబాద్‌కు వెళ్లి ఓ బ్రాందీషాపులో గుమస్తాగా పనిచేస్తున్నాడు. బుధవారం రాత్రి పని ముగించుకుని మరో యువకుడితో కలిసి ద్విచక్రవాహనంపై రూంకు బయలుదేరాడు. ఈక్రమంలో మరో ద్విచక్రవాహనం ఎదురుగా వచ్చి అరవింద్ వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో అతడి తలకు తీవ్ర గాయాలు కాగా వెనుక కూర్చున్న యువకుడికి కాలు విరిగింది. ట్రాఫిక్ పోలీసులు సంఘటనాస్థలికి చేరుకుని వారిని గాంధీ ఆస్పత్రికి తరలించగా అరవింద్ చికిత్స పొందుతూ గురువారం మధ్యాహ్నం మృతిచెందాడు.

సింగరేణి ఆధ్వర్యంలో మహిళలకు ఆటల పోటీలు


మాట్లాడుతున్న సింగరేణి అధికార పతినిధి తుకరాం

కాకతీయఖని, మార్చి 7: ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సింగరేణి ఆధ్వర్యంలో మహిళలకు ఆటల పోటీలను నిర్వహించారు. గురువారం భూపాలపల్లి పట్టణంలోని అంబేద్కర్ క్రీడామైదానంలో ఏర్పాటు చేసిన ఈ పోటీలను ఏరియా అధికార ప్రతినిధి అజ్మీర తుకారం ప్రారం భించారు. ఈ పోటీలలో గెలుపొందిన క్రీడాకారులకు శుక్రవారం ఏరియా జీఎం శ్రీనివాసరావు బహుమతులను ప్రధానం చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్యామ్‌ప్రసాద్, పర్స శ్రీనివాస్, ప్రవీణ్, ఉత్తమ్‌కుమార్, లక్ష్మి, కవిత, అరుణ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోకు వీడ్కోలు సభ

తాడ్వాయి, మార్చి 7: బదిలీపై వెళ్తున్న ఎంపీడీవో సత్యాంజనేయప్రసాద్ వీడ్కోలు సభ స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం జరిగింది. ఈసందర్భంగా సత్యాంజనేయప్రసాద్ మాట్లాడుతూ ఉద్యోగులకు బదిలీలు సర్వసాధరణమని అన్నారు. ఉద్యోగులు ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో గ్రామాలాభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. గ్రామాల అభివృద్ధి కార్యదర్శుల తోపాటు వివిధ శాఖల అధికారులపై ఆధారపడి ఉందని, కార్యదర్శులు విధి నిర్వహణలో కీలకపాత్ర పోషించాలని అన్నారు. అనంతరం ఆయనను పంచాయతీ కార్యదర్శులు, ఎస్ఆర్ఈజీఎస్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈకార్య క్రమంలో ఎంపీడీవో కార్యాలయం, ఎస్ఆర్ ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వ్యవసాయ శాఖ జిల్లా అధికారి పరిశీలన

మంగపేట, మార్చి 7: వ్యవసాయ శాఖ జిల్లా అధికారి విజయచంద్ర మండలంలో గురువారం పర్యటించారు. గిరిజన గ్రామమైన దోమెడలో పంటలను పరిశీలించారు. వరి పంటలో సోకుతున్న చీడపీడల గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. సమగ్ర సస్య రక్షణ చర్యలు చేపట్టాలని పలు సూచనలు చేశారు. అనంత రం రాజుపేటలో ఎరువులు, పురుగుమందుల షాపులను తనిఖీలు చేశారు. ఆయన వెంట వ్యవసాయ శాఖ మండల అధికారి నేదునూరి చేరాలు, ఏఈవో మహేష్ తదితరులు ఉన్నారు.

తాగునీటి ఎద్దడిని నివారించాలి

భూపాలపల్లి కలెక్టర్ భవేష్ మిశ్రా


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ భవేష్ మిశ్రా

భూపాలపల్లి కలెక్టరేట్, మార్చి 7: వేసవి దృష్ట్యా జిల్లాలో తాగునీటి ఎద్దడిని నివారించాలని కలెక్టర్ భవేష్ మిశ్రా అన్నారు. పైపులైన్ లీకేజీలు, బోర్‌వెల్ మరమ్మతు పనులను ఈనెల 15లోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సమీకృత కలెక్టరేట్‌లో ఎంపీడీవోలు, ఎంపీవోలు, మిషన్ భగీరథ అధికారులతో ఆయన గురువారం సమావేశమయ్యారు. వేసవిలో తాగునీటి సమస్య పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. గ్రామ పంచాయతీల పరిధిలోని మంచినీటి పైపులైన్ లీకేజీలు, బోర్‌వెల్ మరమ్మతులను వెంటనేఏ చేయించాలన్నారు. పనుల్లో జాప్యం జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు ఉత్పన్నమైతే ఎంపీడీవోలను బాధ్యులుగా చేసి చర్యలు తీసుకుంటామన్నారు. పంచాయతీల వారీగా అందుబాటు ఉన్న నిధులపై ఎంపీడీవోలు ధ్రువీకరణ పత్రాలను అందజేయాలన్నారు. మంచినీటి అవసరాలకు ఎంతమేర నిధులు అవసరమో నివేదిక ఇవ్వాలన్నారు. ప్రాధాన్యాన్నిబట్టి అవసరమైన అదనపు నిధులను మంజూరు చేస్తామన్నారు. తప్పుడు నివేదికు అందజేస్తే ఎంపీడీవోలు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులపై చర్యలు తీసుకుంటామని అన్నారు. వేసవిలో మంచినీటి సమస్య ఉత్పన్నమైతే ప్రత్యామ్నాయ మార్గాలను అనుసరించాలన్నారు.

సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జడ్పీ సీఈవో విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిక


పార్టీలో చేరుతున్న వారికి కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే గండ్ర

భూపాలపల్లి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మోడెం ఉమేష్‌గౌడ్ గురువారం కాంగ్రెస్‌లో చేరారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సమక్షంలో తీర్థం పుచ్చుకున్నారు. రేగొండ మండలకేంద్రానికి చెందిన ఉమేష్‌గౌడ్ సహా పలువురు ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, కుల సంఘం నాయకులు పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వారిని పార్టీలోకి ఆహ్వానించి కండువా కప్పి సన్మానించారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన వారిలో నడిపల్లి శ్రీనివాసరావు, కేతిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, శంకర్, గండి శంకర్ తదితరులతో పాటు 150 మంది ఉన్నారు.

మాజీ సర్పంచ్ సహా..

చిట్యాల : మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. మాజీ సర్పంచ్‌లు సిద్ధంకి భాస్కర్, చింతల శ్వేత సుమన్, రజిత శ్రీనివాస్, జవహర్ నాయక్, సాంబమూర్తి, నాయకులు బొల్లెపెల్లి రవీందర్, నందు నాయక్, సమ్మయ్య, తిరుపతి రెడ్డి, సంపత్‌తో పాటు సుమారు 150 మంది నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మధువంశీ కృష్ణ, మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి, టేకుమట్ల జడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కాంగ్రెస్‌లో చేరిన వారితో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు